# మెస్సయా

## THE MESSIAH

రచయిత

**యల్.యం.అబ్దుల్లా**

తెలుగు అనువాదం

**ఇవాంజలిస్ట్ డా॥డి.యోబు, డి.డి.**

ప్రథమ ముద్రణ
**1998 మే**
@ All Rights Reserved

ప్రతులు
**10,000 కాపీలు**

వెల
**రూ. 7-00**

రచయిత
**యల్.యం. అబ్దుల్లా**

అనువాదం
**ఇవాంజలిస్ట్ డా॥డి.యోబు డి.డి.**

ప్రచురణ
**బేతని పబ్లికేషన్స్**
చేబ్రోలు - 534406, ప॥గో॥జిల్లా
ఫోన్ : (08818) 61460

ముద్రణ
**గ్రేస్ గ్రాఫిక్స్**
42-2-210, దేవీనగర్
బుడమేరు వంతెన దగ్గర
విజయవాడ - 520 003
ఫోన్ : (0866) 531128

# మెస్సయా

## విషయసూచిక


1. అహ్మద్ మరియు హన్ని ............... 1
2. దేవుని గొర్రెపిల్ల ............... 3
3. దేవుని వాక్యము ............... 6
4. దేవుని అర్పణము ............... 9
5. పాపము ............... 13
6. అబ్రహాము కుమారుడు ............... 17
7. దేవుడు ఒక్కడే ............... 21
8. దేవుడు మరియు నరుడు ............... 26

# అహ్మద్ మరియు హమ్ది

## Ahmad and Hamdi

అహ్మద్ ఒక ఆఫీసులో పనిచేయుచుండెను. తనపని యందు అసక్తి లేని వాడని చేప్పలేము గాని, తన డిపార్ట్‌మెంట్ అధికారియే అతనికి సమస్యగా నుండెను. ఎందుకనగా తన పనితనమును నిరూపించుకొనలేనివాడుగా నుండెను. తనకు అప్పగించబడిన ప్రతి పనియందు తన అధికారికే ఘనత దక్కెడిది.

ఆ స్థితిలో తన ఉద్యోగమును మార్చుకొనవలెనన్న ఆకాంక్ష తనయందు అనేకసార్లు తలెత్తెను, అయితే ఉద్యోగ అవకాశములంత మెరుగుగా నుండనందున ప్రస్తుతానికి ఏదొక పనియందు తృప్తి చెందుటయే మంచిదని యెంచెను. తనకు వచ్చు జీతము మిగిలిన ఉద్యోగములకంటె ఎక్కువగానున్నందున, తానున్న కంపెనీలోనే కొనసాగెను. తనభార్యతో బాటు ముగ్గురు పిల్లల పోషణభారం తనపైనున్నందున ధన సముపార్జన ప్రాదాన్యత కలిగియున్నది. తనపిల్లలనిన తనెంతో అతిశయించెడవాడు. ముఖ్యముగా తన పెద్ద కుమారుడు "హస్సాన్" యూనివర్సిటీలో ఇంజనీర్ చదువుచున్నందున అతని విషయమై మరింతగా అతిశయించెడివాడు.

ఒక దినమున తన పనిలో జరిగిన ఒక సంఘటన పరిస్థితులు మెరుగవుటకు కారణమాయెను. 'హమ్ది' యను నతడు అహ్మద్ పని చేయు డిపార్టుమెంటులో పని వానిగా చేరెను. అతడు అహ్మద్‌కంటె కొంచెము చిన్నవాడు. అంతేగాక ఎప్పుడు సంతోషముగా నుండి సమాధానముతో తన పని యందు నెమ్మదికలిగి యుండెడివాడు. ఈ మంచి వ్యక్తి అహ్మద్‌కు పనిలో స్నేహితుడాయెను. వారిద్దరు కలిసి మధ్యాహ్న భోజనము చేయుటయే గాక ప్రతి సాయంకాలము కలిసి కొనెడివారు. హమ్ది సహ వివాహితుడు. దేవుడతనిని నలుగురు చక్కటి బిడ్డలతో ఆశీర్వదించెను. ఇద్దరు మగ పిల్లలు యిద్దరు ఆడ పిల్లలు.

అహ్మద్, హమ్ది మంచి స్నేహితులైనందున తరచుగా వారి వారి యిండ్లలో కలిసికొనెడివారు. కలిసి టీ సేవిస్తూ సంభాషించు కొనెడివారు. ఎన్ని గంటలు గడిచినా వారు ఎన్నో విషయాలను గూర్చి తలంపులను పంచుకొనెడివారు.

ముందుగా వారు ఆఫీసు విషయములను చర్చించెడివారు. తదుపరి జీవితములో బహు ప్రధానమైన సంగతులను యోచించెడివారు. అయితే వారిద్దరు మత విషయములలో బహు నిష్ఠగలవారు గాని ఒకే మతమునకు చెందినవారు కారు. అహ్మద్ ముస్లిం. తన స్నేహితుడు బైబిలును అనుదినము పఠించుటతో బాటు మెషయా (అల్‌మషియా) ను అనుసరించెడివాడు.

అయితే అహ్మద్, హమ్జి జీవితమును గమనించు కొలది తన భక్తిని దేవుని యందలి విశ్వాసమును గౌరవించెడివాడు. అంతేగాక తనకు లేని, తెలియని ఆత్మీయ సంబంధమును తన స్నేహితుడు దేవునితో కలిగి యున్నట్లు గ్రహించినందున మరెక్కువగా ఆసక్తిని పెంచుకున్నాడు. హమ్జి జీవితము తన దేవుడైన మెషయాతో ముడి పడి యున్నట్లు గుర్తించాడు. హమ్జి యంత కాకపోయిన 'అహ్మద్' కూడా మెషయా యందు విశ్వాసముంచాడు. అనగా 'కురాన్' లో మరియ పుత్రుడు గా చెప్పబడిన యేసును (అయిన అబ్నె మరియాం) ను గూర్చి వ్రాయబడిన విషయములన్నిటిని నమ్మి, మెషయా యందు గౌరవమును పెంచు కున్నాడు. యేసు కన్య మరియకు జన్మించాడని అహ్మద్ ఎరిగి యున్నాడు (మరియాం అల్ - అద్రా). అంతేగాక ఆయన దేవుని ఆజ్ఞనొంది అద్భుతములు, మహత్కార్యములు చేయుటతో బాటు "సువార్త" ను (అల్-యింజల్) పొంది యున్నాడని ఎరిగియున్నాడు. అందుకే ఆయనను గూర్చితనకు కొంచెమే తెలిసినందున మరెక్కువగా తెలిసికొన నాసక్తి పెంచుకున్నాడు. మరియు 'కురాన్' లో కూడా యీ అపోస్తలునికి (రసల్) అనేక నామములున్నట్లు వ్రాయబడెను.

ఒకనాడు తన ఆసక్తి మరింతగా ఒత్తిడి చేసినందున, మెషయాను గూర్చి తనమంచి స్నేహితునినుండి తెలిసికొనగోరెను. ఆ తీర్మానము అనేక ఆసక్తి కలిగించు విషయములు తెలిసికొనుటకు కారణమాయెను.

# దేవుని గొఱ్ఱెపిల్ల

## The lamb of God

మరియ పుత్రుడైన యేసును గూర్చి నాకు తెలియజేయమని బహు ఆసక్తితో అహ్మద్ తన స్నేహితుడైన హమ్జిని బ్రతిమలాడెను. ఆయనను గూర్చి మరెక్కువగా తెలిసికొన గోరుచున్నానని తన ఆశను తెలియపర్చెను.

హమ్జి కొంచెము యోచించి ఇట్లనెను/ మెషయా యీ లోకమునకు ఎందుకు వచ్చెనో తెలిసికొన గోరినచో ముందుగా "అర్పణ" ను గూర్చి తెలిసి కొనవలెనని చెప్పెను.

అర్పణయా? నీవుద్దేశ్యమేమిటి ? యని అహ్మద్ ఆశ్చర్యపడెను. అందుకు 'హమ్జి' యిట్లు చెప్పసాగెను. 'అర్పణ' భావమును మనము "యిద్ ఆల్-ఆత్హా" (అర్పణవిందు) యందు చూడగలము. నీవు ఎరిగినట్లు దేవుడు అబ్రహామును (సయెద్నా ఇబ్రహీం) తన కుమారుని అర్పణగా యిమ్మని అడిగినప్పుడు, దేవుడు (అల్లా) తన కుమారునికి ప్రతిగా అర్పించుటకు వేరొక ఏర్పాటు చేసియుండ (ఫిదా) నిచో ఏమి జరిగి యుండును? అందుకు అహ్మద్ - ఇష్మాయిల్ చనిపోయియుండునని జవాబిచ్చెను. అందుకు హమ్జి - అర్పణయనగా అట్టిదేనని చెప్పెను అనగా ఒకరికి బదులు మరొక్కరు చనిపోవుట. దేవుడు గొఱ్ఱెను పంపినందున తన కుమారుని స్థానములో అది అర్పించబడెను. నేనునూ మరణ ప్రభావము క్రింద నుండి యుందునని హమ్జి జవాబిచ్చెను.

అందుకు అహ్మద్ ఆశ్చర్యముతో - నీవుద్ధేశ్యము ఏమిటని ? అడిగెను. వెంటనే హమ్జి గద్గద స్వరముతో గట్టిగా యిట్లనెను - బైబిలునందు యిట్లు వ్రాయబడెను (పవిత్ర గ్రంధమందు)

"పాపమునకు జీతం మరణం"

నా పాపమునకు జీవితం మరణం - ఎందుకనగా నేను పాపిని. అవును యితరులు నన్ను బహు మత నిష్ఠాగరిష్ఠుడనుగా చూస్తున్నారు. నేను ప్రతి దినము దేవుని ప్రార్థిస్తాను. ఆయన గ్రంధపఠనము చేయుదును, ఆయనకు సేవ జేతును. అయితే దేవుని యెదుట నేను పాపిని. దేవునికి వెలుపల సంపూర్ణ మైనదేదైనా యున్నదా? యని హమ్జి ప్రశ్నించాడు. అందుకు అహ్మద్-లేదు-యని జవాబిచ్చెను. దేవుడొక్కడే పరిపూర్ణుడు - గనుక-

మనమందరము దేవుని యెదుట పాపులము, కాదందురా? యని హమ్ది ప్రశ్నించెను.

అందుకు అహ్మద్ అది నిజమని అంగీకరింతుననెను.

అబ్రహాము కుమారుని వలె నేనును మరణ భయమందుంటిని. అయితే నా పాపములకు అర్పణ ఏది? దేవుడే అందుకు తగిన అర్పణ చేయకపోతే నా యీ స్థితి నుండి ఎవరు విడిపింతురు? అని హమ్ది అడుగగా - అహ్మద్ అందుకు జవాబు నెట్లు చెప్పవలెనో ఎరుగకుండెను. గనుక 'హమ్ది' చెప్పసాగెను. స్నానికుడైన యోహాను (యహ్యా అబ్నె జకరియా) మెషయా కాలమందుండెను. యోహాను మొదటి సారిగా మెషయాను చూచినప్పుడు- యిట్లనెను-

"ఇదిగో లోక పాపమును మోసికొనిపోవు
దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1:29)

" మెషయ మనుష్యుని గొఱ్ఱెపిల్ల కాదు. ఆయన దేవుని యొద్ద నుండి వచ్చి యున్నాడు. ఆయన పరమునుండి వచ్చినవాడు. దేవుని ఆత్మ (రహ అల్లా) కన్య మరియను(మరియాం)ఆవరించెను. ఆమె గర్భవతియై కుమారుని కనెను. ఆయన మన మెరిగినట్లు "యేసు" యని ఆయన పేరు. ఆయనే దేవుని వాక్యము (కాలిమత్ అల్లా) ఆయనే దేవుని ఆత్మ (రహ అల్లా). ఆయన పరిశుద్ధుడు ఆయన దేవుని గొఱ్ఱెపిల్లగా పరలోకమునుండి వచ్చెను. మెషయ యే దేవుని యెదుట నిందా రహితుడుగాను పరిపూర్ణుడుగా నుండి నందున ఆయనయే దేవుని గొఱ్ఱెపిల్లగా నిరూపించుకొనెను. ఆయనయే పరిపూర్ణమైన దేవుని గొఱ్ఱెపిల్ల అయినందున సర్వశక్తుడైన దేవుని తానెన్నడు పాపక్షమాపణ కోరినవాడుగా చూడము (అస్తాగ్ ఫర్ అల్లా అల్- అజీమ్). ఆయనయే లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల.యిష్టపూర్వకముగా తన ప్రాణము నర్పించి నందున యిది నెరవేరెను. ఆయన మరణమును జయించి పునరుత్థానుడై పరలోకమునకు ఎక్కి వెళ్ళెను ఏదొక దినమున ఆయన తిరిగి యీ లోకమునకు రానున్నాడు.

హమ్ది కొంచెము ఆగి, అహ్మద్‌ను చూస్తూ యిట్లు చెప్పసాగెను - నేనును అబ్రహాము కుమారుని వలె మరణచ్చాయలో నున్నాను. అయితే మెషయా యను పవిత్రమైన గొఱ్ఱెపిల్ల ద్వారా నాపాపప్రాయశ్చిత్తార్థమైన బలి జరిగినందున నాకు అర్పణ సిద్ధ పరచబడినది. ఇప్పుడు యీ గొఱ్ఱెపిల్ల ద్వారా దేవుడు మన పాపములకు క్షమాపణ సిద్ధపర్చెను. దాని ద్వారా పరదైసులో (జన్నా) నిత్య జీవము నొందు ఏర్పాటు గావించెను మెషయా లోక పాప భారమును మోసెను. అవును అహ్మద్ ఆయన నీ పాపములను సహా మోసెను సుమా.

అహ్మద్ ఆలోచిస్తూ నెమ్మదిగా - అట్లే కూర్చుండిపోయెను. అప్పుడిట్లనెను మెషయా లోక పాపమును మోసికొని పోయినచో, నేను చావనవుసరము లేదు, నాకు యిది వరకే నిత్య జీవము దొరికెను.

అహ్మద్ యని హమ్ది పిలిచి, ఒకవేళ యీ రోజు మెషయా నీ తలుపునొద్ద నిలుచుండి తట్టుచూ నీకు నూతన జన్మ ప్రసాదించి, నీ జన్మ దినముగా చేయగోరుచున్నాడేమో గమనించుము.ఆయన నీతో యిట్లను చున్నాడు - అహ్మద్, నీకు యిప్పుడు పాపక్షమాపణ యివ్వగోరుచున్నాను. నాతో సజీవమైన వ్యక్తిగత సంబంధమును యీనాడే యివ్వగోరుచున్నాను. అయితే దాని కొరకు కొన్ని నిబంధనలున్నాయి. మొదటిదిగా నీ పాపముండి వెనుదిరగాలి, ఒప్పుదలతో నేను నీ కొరకు చేసిన అర్పణ ద్వారా నేనిచ్చు క్షమాపణను పొందుము. నీవు యీ వరమును పొందినచో, అదినీదే, యింకొకరిది కాదు.

అహ్మద్ కూర్చుండి యోచనలో మునిగిపోయాడు. అతడు కలవరముతో నిండి నిజమునకు తానేమి చేయవలెనో ఎరుగకుండెను.

అప్పుడు హమ్ది యిట్లనెను - నీవు యిదే అర్పణ అసలైన తుది ఋజువుగా గ్రహించుచున్నావా? నిజమునకు ప్రతి దైవ సేవకుడు మెషయాయే దేవుని యొద్దకు మార్గమని ఉపదేశింతురు. అనగా సజీవుడును, మృత్యుంజయుడైన కన్యకుమారుడైన యేసు క్రీస్తే తలుపునొద్ద నిలుచుండి తట్టు చున్నాడని బైబిలులో చెప్పబడినది.

“ఇదిగో తలుపు నొద్ద నిలుచుండి తట్టుచున్నాను ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము. (ప్రకటన 3:20)

మరియు హమ్ది యిట్లనెను - మెషయాకు నా హృదయ ద్వారము తెరచి, నా రొట్టెను విరచి నాతో సహవాస సంబంధము కలిగియుండునట్లు లోనికి ఆహ్వానించుట ఏమిటో తెలుసుకొందువా? అదే దైవ వరమును పొందుట యగును, అదే దేవుడు ప్రతివారికి యిచ్చుటకు యిష్టపడు వరము.

అందుకు అహ్మద్ యిట్లనెను అవును హమ్ది నీతో నేనిదే చెప్పగోరుచున్నాను. నీవు మెషయాను గూర్చి నాతో చెప్పినది నా హృదయాంతరంగమును తాకింది. అయితే మరింతగా మరలా కలిసినప్పుడు మెషయాను గూర్చి వినగోరుచున్నాను.

మీకు సమాధానము కలుగును గాక (అల్ సలాము ఆలేకాం) మరియు మీ మీద సమాధానముండును గాక.

(ఆలేయ్ కాం అల్-సలాం)

# దేవుని వాక్యము

## The Word of God

మరియ పుత్రుడు యేసు క్రీస్తును గూర్చి గత సారి నీవు చెప్పిన దానిని బట్టి నేనెంతో ఆలోచించా నంటూ అహ్మద్ తన మాటలను మామూలుగానే ప్రారంభించాడు. నీవు నన్ను అన్యథా భావించవను నమ్మకముతో నా ప్రశ్నలకు సమాధానము కోరుచున్నాను. తదుపరి మన మామూలు విషయములను యోచించవచ్చు.

అందుకు 'హమ్జి' కొంత వరకు అహ్మద్ ఆలోచనలను గ్రహించినట్లు - ఫరవాలేదు అడుగమన్నాడు.

మరలా అహ్మద్ - యిట్లు చెప్పసాగాడు - ముస్లిములైన మనము - పరసంబంధమైన గ్రంథములను నమ్మెదుము. (అల్ తోరా - మోషే పంచ గ్రంధములు), అల్- జబార్ (దావీదు కీర్తనలు ), అల్ - యింజల్ (యేసు - సువార్త) మరియు పరిశుద్ధ 'ఖురాన్'

ఖురాన్ గాక మిగిలిన గ్రంథములను యూదులు క్రైస్తవులు తప్పుడు గ్రంథములుగా చెప్పుదురని నేర్చుకున్నాను. గనుక వాటి యందేమి వ్రాయబడినదో విశ్వసించ నీవు సరత లేదు గదా? నీవు పరిశుద్ధ గ్రంథమని చెప్పు బైబిలు తప్పుల తడక (మొహర్రఫ్) మరియు కొంత సత్యము మరికొంత అసత్యముల కలయిక.

మంచిది, అయితే చరిత్రక ఋజువులను నీవు దీనికి చూపగలవా? యని హమ్జి అడిగాడు.

అందుకు అహ్మద్ ఆశ్చర్యపడి - తానెన్నడు యిట్టి గుర్తించని నేరారోపణలను గూర్చి వినలేదని గుర్తించాడు. ఇంతలో హమ్జి కొనసాగించి - నీవు ఆరోపించిన తప్పులు ఎప్పుడు తలెత్తాయో లేదా దానిని అట్లు ఋజువు చూపుటకు సాధ్యమైనదో చెప్పగలవా? యని అడిగాడు.

లేదు, నేను చెప్పలేనంటూ... అంతేగాక ఎవ్వరూ యిట్టి మూల ప్రశ్నలకు జవాబులను చెప్పియుండ లేదంటూ, అహ్మద్ తొందర పడ్డాడు.

కొంత సమయానంతరం - ఖురాన్‌లో తప్పులుండుటకు ఆస్కారమున్నదాయని, హమ్జి ప్రశ్నించాడు.

అందుకు అహ్మద్-

"అస్తాహ్ ఫర్ అల్లా (నేను దేవుని క్షమాపణ కోరుదును). నిజమునకు అట్టిది ఖురాన్ విషయంలో అసాధ్యము. దాని విశ్వాసులు ఖురాన్‌ను తప్పుపట్టుటకు ప్రయత్నించు వారిని సహా సహించరు, అట్లు జరగ నీయరు.

హమ్డి జవాబిచ్చాడు. అట్లయితే బైబిలును తప్పుగా నెట్లు తలంతుము. దానిని విశ్వసించువారెట్లు దానిని తప్పు పట్టుటకు లేక మార్పు చేయుటకు అంగీకరింతురు? సర్వశక్తుడైన దేవుని యందు విశ్వసించుచున్నాను. ఆయనే భూమ్యాకాశములను సృజించినవాడు. ఆయనే తన ప్రజలకు వాక్యమునిచ్చెను. దానిని ఆయనే మార్పు చేయనీయక భద్రపరచును.

హమ్డి తన నేత్రములతో సూటిగా అహ్మద్‌ను పిలుస్తూ అడిగాడు- అహ్మద్, సమస్తము దేవుని చిత్త ప్రకారము జరుగునని నీవు నమ్ముచున్నావా? అవును నేనట్లు నమ్ముచున్నానని అహ్మద్ ఉదులిచ్చెను.

హమ్డి మాట్లాడుచూ - దేవుడు నరులకు ముందుగా తన వాక్యమునిచ్చి, దానిని కలుషితము చేయుటకు ఒప్పుకొనునా? అట్టిది జరగనీయక సర్వశక్తుడు భద్ర పరచలేడా?

అవును. దేవుడు తప్పక భద్రపరచగలడని అహ్మద్ అంగీకరించాడు.

అహ్మద్ నీవు దీని నెరుగుదువా? బైబిల్ అద్భుత గ్రంథమని, దాదాపు 1400 సంవత్సరముల కాలములో వ్రాయబడి అల్-తోరా (మోషేపంచ గ్రంథములు) అల్- జబర్ (కీర్తనలు) అల్-యింజల్ (సువార్త) మరియు దేవుని అపోస్తలులు (రొసల్) మరియు ప్రవక్తలు (అన్‌బియా) వ్రాసిన గ్రంథములు యిందున్నవని ఎరుగుదువా? బైబిలు రెండు భాగములుగా చేయబడి, పాతనిబంధన, మెషయా పుట్టకముందు కాలమును చెప్పుచుండగా, క్రొత్తనిబంధన మెషయా లోకమునకు వచ్చిన (పుట్టిన) నాటి నుండి చెప్పబడినది. బైబులు మూడు భాషలలో వ్రాయబడినది.

అందుకు అహ్మద్ ఆ భాష లేమని ఆశ్యర్యముతో అడిగెను. అవి - హెబ్రూ, అరామిక్ మరియు గ్రీకు భాషలు. ఆయన వాక్యము నిచ్చుటకు దేవుడు భిన్నమైన వ్యక్తులను వినియోగించియున్నారు. కొందరు రాజులు లేక రాజరికముతో సంబంధము గలవారు. మిగిలిన వారు కాపరులు లేక జాలరులు. బైబిలు దేవుని నుండి యివ్వబడిన మహా అద్భుతము. కాలవ్యవధిలో భిన్న తత్వములు గలవారు వాడబడినప్పటికి గ్రంథమంతయు ఒకే ఆత్మీయతను కలిగి యున్నది. ఆ ఉద్దేశ్యము లేక

వర్తమానము "మెషయా" (అల్-మషియా) యని హమ్ది చెప్పెను. అందుకు ఆశ్చర్యముతో అహ్మద్ - దేవుడు మెషయాను గూర్చి 1400 సంవత్సరములు బయలు పరచెననుట సత్యమగునా? యని అడిగెను.

చిరునవ్వుతో హమ్ది యిట్లనెను - అహ్మద్ దేవుడు మానవ చరిత్ర కాలమంతటిలో యిప్పటివరకు మెషయాను గూర్చి చెప్పుచూనే యుండెను.

అనుమానముతో అహ్మద్, యిది నిజముగా సాధ్యమా? యని ప్రశ్నించెను.

అవును దేవునికి సమస్తము సాధ్యమే ! మరలా కలిసినప్పుడు యీ విషయములను గూర్చి సంభాషించుకొందుమని హమ్ది చెప్పి చాలించెను. అహ్మద్- ఆ సమయము కొరకు నేను ఆశతో యెదురు చూచుచున్నాను.

"అల్ - సలామో - యలేకాం
అలేకాం - అల్ సలామ్."

(సమాధానము మీ మీద నిలిచి యుండును గాక).

# దేవుని అర్పణము

## The Sacrifice of God

'మెషయా' బైబులు అంతటలో ప్రధాన వర్తమానముగా నెట్లుండగలదోనన్న విషయము నాకెంతో కుతూహలము కలుగ జేయుచున్నదని - అహ్మద్ అనగా - హమ్ది -

మనము మెషయా యే దేవుని గొఱ్ఱెపిల్లగా మన పాపములను భరించెనని చెప్పుకున్న విషయము జ్ఞాపకమున్నదా? యని అడిగెను.

అహ్మద్ - ఆ జ్ఞాపకమున్నది. నేనెట్లు దీని మరువగలను?

హమ్ది - దేవుడు మానవ చరిత్రలో అర్పణ యొక్క అవసరతను గూర్చి మరియ కుమారుడైన యేసు క్రీస్తు వచ్చు వరకు చూపుచునే యుండెను గదా!

అహ్మద్ - ఏ రీతిగా?

హమ్ది - కయీను (ఖాబిల్) మరియు హేబెలు (హాబిల్) కాలములో భూమి యందెందరున్నారో గదా?

అహ్మద్ - కొంత ఆలోచించి నలుగురని - వారు ఆదాము హవ్వ (హవా) మరియు కయీను, హేబెలు.

హమ్ది - కేవలం నలుగురు మాత్రమే ! అయినను దేవుని ఆరాధించుటకు అర్పణ అవునరమని గుర్తెరిగిరి. వారికది ఎట్లు అర్థమాయెనని చెప్పుచూ దేవుడు పరమ పవిత్రుడును, నరుడు పాపనైజముతో ఆయనను చేరుటకు తన పాపమునకు ప్రాయశ్చిత్తము చేయ వలసియున్నాడు. నోవహు (సయొద్నా నోవహు) దేవుని అర్పణతో ఆరాధించెను - అబ్రహాము (సయేద్నా ఇబ్రహీము) సహా అర్పణతో దేవుని సేవించెను. మోషే (సయొద్నా - మోస), దావీదు (సయొద్నా - దావూద్) మరియు అపోస్తలులు, ప్రవక్తలు దేవుని అర్పణలతోనే ఆరాధించిరి. నా మట్టుకు నేనును అపోస్తలులు - ప్రవక్తలవలెనే దేవుని ఆరాధింతును - అందుకు అహ్మద్ - కాదు. నీవు నాతో పరిహాసము చేయుచున్నావు. నీవు మార్కెట్‌కు వెళ్ళి గొఱ్ఱెను తెచ్చి అర్పించలేదు గదా? యని పెద్ద ముఖము చేసికొని నవ్వు చుండెను.

హమ్ది-అవును, నేను దేవుని గొఱ్ఱెపిల్లయైన మెషయా సిలువపై అర్పించబడుట ద్వారా నా పాపములను భరించినందున ఆయన ద్వారా అర్పణనర్పించుచున్నాను. ఇది బైబిలు పవిత్ర గ్రంధమందు చెప్పబడెను.

"దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే, ఆయన క్రీస్తు యేసను నరుడు (1 తిమోతి 2:5)

దేవుడు ఒక్కడే మనకు దేవునికి మధ్య వర్తియు ఒక్కడే ఆయనే మెషయా, ఆయనే ప్రాయశ్చిత్తార్థ అర్పణ (ఫిదా) మనందరి కొరకు చేసెను. మానవ చరిత్రలో నేటి వరకు సజీవ దేవుని అర్పణలతోనే సేవించుచుండిరి.

అహ్మద్ - హమ్దినీవు చెప్పుచున్నది నాకు కొంత అర్థమగుచున్నది. సంపూర్ణముగా నెరుగుటకు మరింతగా చెప్పవలసి యున్నది.

కొంత సమయమైన తదుపరి హమ్ది యిట్లనెను - ప్రాయశ్చిత్తార్థ అర్పణ భావమును మోషే ద్వారా దేవుడు తారాలో (మోషే పంచ గ్రంథములు) తెలియజేసి యున్నాడు. ధర్మశాస్త్రము (అల్- షరియా) యొక్క సంపూర్ణ భావము పాప క్షమాపణ కొరకు యీ క్రింది లేఖనములలో తెలియజేసెను -

మరియు ధర్మ శాస్త్ర ప్రకారము సమస్త వస్తువులును రక్తము చేత శుద్ధి చేయబడుననియు, రక్తము చిందింపకుండ పాప క్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును (హెబ్రీ 9:22)

ఈ అర్పణమును గూర్చిన ఉపదేశము కన్య మరియ పుత్రుడైన యేసు అర్పణతో ముడిపడియున్నదా? యని అహ్మద్ ఆశ్చర్య పడెను. అవును అర్పణను గూర్చిన ఉపదేశమును గూర్చి ప్రవచనములు మెషయాను చూపుచున్నవి. ఈ ప్రవచనములను బట్టి మెషయా లోకములోనికి వచ్చినప్పుడు మన పాపముల నిమిత్తము ప్రాయశ్చిత్తముగా అప్పగించబడ వలెనని చెప్పబడెను. హమ్ది బైబిలు తెరచి- మెషయా యీ లోకములోనికి రాకముందు 700 సంవత్సరముల క్రిందటే,ఆయన చేయవలసిన సిలువ యజ్ఞమును యోచించుటద్వారా గ్రహించనగును.

"నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడిన వానిగాను దేవుని వలన బాధింపబడిన వానిగాను శ్రమనొందిన వానిగాను మన మతనిని ఎంచితిమి. మనయతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీదపడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. మన మందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలిగెను యెహోవా మన యందరి దోషమును అతని మీద మోపెను. అతడు దౌర్జన్యము నొందెను బాధింపబడినను అతడు నోరు తెరవలేదు వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు, బొచ్చు కత్తిరించు వాని యెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు (యెషయా 53 : 4-7)

అహ్మద్ - ప్రవక్త వచనములచే తాకబడిన వాడై - యిన్ని సంవత్సరములకు ముందే కన్య మరియ పుత్రుడైన క్రీస్తును గూర్చి ప్రవక్త ప్రవచించెనా? అనెను. అందుకు హమ్ది - అవును ప్రవక్తల ప్రవచనములను బట్టి, మెషయా దావీదు కుటుంబము నుండి (నబి-దావూద్) రావలెను. దావీదు, మెషయా కంటే వెయ్యి సంవత్సరములయందుజీవించెను. అయన సిలువ కార్యమే యీ ప్రవచన నెరవేర్పు. సిలువ విధానము నెమ్మదిగా శిక్షను భరింప జేయుటను చూపును. అంతే గాక సిలువ శిక్ష ననుభవించిన వ్యక్తి ఎముకలు వసులడి పోవును. మరియు దప్పిగొన్న వాడగును. ప్రవక్తయైన దావీదు యిట్లు వ్రాసెను.

"నేను నీళ్ళవలె పారబోయబడియున్నాను."
నా యెముకలన్నియు స్థానము తప్పియున్నవి
నా హృదయము నా అంతరంగమందు మైనమువలె కరిగి యున్నది.
నా బలము యెండి పోయి చిల్లపెంకువలె ఆయెను
నా నాలుక నా దౌడను అంటుకొని యున్నది
నీవు నన్ను ప్రేతల భూమిలో పడవేసి యున్నావు.
కుక్కలు నన్ను చుట్టుకొని యున్నవి
దుర్మార్గులు గుంపుకూడి నన్ను ఆవరించియున్నారు
వారు నా చేతులను నా పాదములను పొడిచియున్నారు
నా యెముకలన్నియు నేను లెక్కింపగలను
వారు నిదానించుచు నన్ను తేరి చూచుచున్నారు
నా అంగీ కొరకు చీట్లు వేయుచున్నారు (కీర్తనలు 22:14-18)

"దావీదు యీ ప్రవచనములు వ్రాయు కాలములో సిలువ శిక్ష లేనప్పటికి దానిని గూర్చి చెప్పెను. రోమీయుల పాలన మెషయా కాలమందు సిలువ శిక్ష అమలులోనికి వచ్చెను.

యీ ప్రవచనములోని వివరణ కన్య మరియ పుత్రుడైన యేసు క్రీస్తును గూర్చినదిగా చెప్పుచున్నావా? యని అహ్మద్ చెప్పగా- అందుకు హమ్ది-

అవును అంత మాత్రమే గాక, అనేక ప్రవచనములు మెషయా యందు ప్రతి అక్షరము నెరవేరుట చూడగలమనెను అంతేగాక తనకు తానే మెషయా అనేక సందర్భాలలో తన ప్రాణమును అనేకులకు క్రయ ధనముగా అర్పించబడెను (ఫిడా)

మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము యిచ్చుటకును వచ్చెననెను. (మార్కు 10:45)

అహ్మద్ పాప పరిహార అర్పణను గూర్చి బైబిలు నందు చెప్పబడి నది మెషయాలో నెరవేరుట చూచుచున్నావా? అవును హష్మి, యిట్టి వార్త నెన్నడు నేను విని యుండలేదు. ఇదెంతో చక్కటి విషయము. నేనింకా ఆలోచించాలి. మరిన్ని ప్రశ్నలకు జవాబు నీ నుండి పొందాలని ఆశయున్నది. నేను మరలా వస్తాను.

హష్మి - దయతో యీ బైబిలును కానుకగా తీసుకొనుము, క్రొత్త నిబంధన చదువుము. అందు మెషయా జీవితము, అద్భుతములు, ఉపదేశమును చూడగలము.

అహ్మద్ - చాలా వందనస్థుడను. బైబిల్ ప్రజలను గూర్చి బహుగా తెలుసుకున్నాను (అహల్ -ఆల్ - కితాబ్), అయితే గ్రంథమును యిది వరకు చదివి యుండలేదు. మరియ పుత్రుడైన యేసు ఉపదేశమును, అద్భుతములను గూర్చి పఠించుటకు ఆశపడుచున్నాను.

"అల్ సలాం - అలెకాం"

అలెకాం - అల్ సలాం.

# పాపము

## Sin

అహ్మద్, హమ్డిని చూచి మాట్లాడనారంభించెను. మనము గతసారి కలిసిన తరువాత - మెషయ మానవ పాప పరిహారము కొరకు ప్రాయశ్చిత్తార్థ బలి చేయుటను గూర్చి ఆలోచించుచున్నాము. అయితే నేనొక విషయము తెలిసికొనగోరుచున్నాను. పాపము ఎక్కడ (అల్-ఖటియా) నుండి వచ్చెను? నరులకు పాపమును గూర్చిన సమస్య ఎందుకు కలిగెను? దానిని చెప్పగలవా? అని అహ్మద్ చాలా మంటతో అడిగెను.

అవును నేనట్లే తలంచుచున్నానని వివేకంతో హమ్డి చెప్పి, పాపము ప్రవేశించుటకు గల కారణము నెరగుటకు మనము కొంత వెనక గాధను చూడవలసి యున్నామనెను. తోరా ( పంచ గ్రంధములు) లో దేవుడు లోకమును, నరజాతిని సృష్టించిన తదుపరి, నరుని పరదైసులో నుంచి నట్లు చూతుము. పరదైసులో నరుడు సంపూర్ణముగా పరిశుద్ధుడునై యుండి దేవునితో సంపూర్ణ బాంధవ్యమును కలిగియున్నాడు. అయితే నీవు యెరిగినట్లు, జరిగిన సంఘటన ద్వారా పరదైసులో నరుని జీవితము పతనమై పోయింది. వెంటనే అహ్మద్- ఏమి జరిగిందని ప్రశ్నించి, సాతాను అందు ప్రవేశించి సమస్తమును నాశనము చేసాడా? అందుకు హమ్డి - అవును సరిగా అదే జరిగింది. ఆదాముతో దేవుడు మంచి చెడ్డల తెలివి నిచ్చు పండును తిన వద్దని ఆదేశించాడు.

"నీవు ఆ పండు తిను దినమున నిశ్చయముగా చచ్చెదవనెను" (ఆది 2:16-17)

అయితే సాతాను సర్పము రూపమందు వచ్చి ఆదాము హవ్వలను శోధించెను. దైవాజ్ఞను మీరి వీరు పండును తినెను. దాని ప్రతిఫలమే మానవ పతనము. పాపము ప్రవేశించినందున నరులందరు పాపులైరి.

నిజమునకు ప్రతివారు పాపులుగా మారినారా? యని అహ్మద్ వింతగా అడిగెను అవును తాను తినిన పండువలె "మంచి చెడ్డలను ఎరిగిన వారైరి" అని హమ్డి జవాబిచ్చెను "నరుడు వింతైన మంచి చెడ్డల కలయికగా మారెను' ' కొన్నిసార్లు చక్కటి, ఖ్యాతి నార్జించు మంచి కార్యములు చేయును, మరుక్షణమే కొన్ని సార్లు బహుభయంకర మైన, దుష్టత్వముతో కూడిన కార్యములు, తుద కుతన పొరుగు వారిని మోసము చేయు, నష్ట పరచుకార్యములు చేయుచుండును కక్ష, స్వార్థము, శరీరేచ్ఛ యీ రీతిగా పాపనైజమునకు చెందిన యేదొక కార్యము చేయుచుందురు. నీవు చెప్పినట్లు

నరులందరు యిదే సమస్యతో సతమతమగుచున్నారు. ప్రతి మతము యీ సమస్యను గూర్చే చెప్పుచున్నవి. ప్రతి దేశము పాప ప్రభావమును అదుపు చేయుటకు చట్టములను చేయుచున్నది. అయితే అసలు విషయమేమనగా ప్రజలు పాపము చేసినందున పాపులు కాలేదు. వారు పాపులైనందున పాపము చేయుచున్నారన్న నగ్న సత్యము నెరుగక పోవుటయే! పాపోత్పత్తి చేయు చిన్న కర్మాగారములోనున్నది, దాని ప్రభావమే పాపము, దుష్టత్వము - అవునా? కాదా? యని హమ్ది చెప్పుచూ "అహ్మద్"ను పరిశీలనగా చూచెను.

అవును, నీవు యిచ్చిన వివరణ మానవ స్వభావమును కన్నులకు కట్టినట్లే చూపుచున్నది. నరులు మంచి చెడ్డల వింత కలయిక యని అహ్మద్ జవాబిచ్చి యిట్లనెను-అయితే, సాతానునకు ఎట్లు యిందు ప్రమేయము కలదు? మంచి ప్రశ్న, పాపమును బట్టియే సాతాను మానవ జీవితములలోను వ్యవస్థలోను అధికారమును ఛలాయించుచున్నాడని హమ్ది జవాబిచ్చెను. ఆదాము హవ్వలను శోధించిన వాడే అదే రీతిగా నేటికిని చేయుచున్నాడు. నరులనందరిని అట్లే శోధించుటచేపాపమందునిలిచి యుండునట్లు చేయుచున్నాడు. పాపమును బట్టియే మానవ జీవితములతో చలగాటమాడి దేవుని నుండి వేరు చేయగలిగియున్నాడు. అందుకే యీనాడు లోకము యింత భయంకర స్థితిలో నున్నది. దేవుడు సమస్తమును మంచిగా సృష్టించెను, అయితే నరులు ప్రవృత్తి లోకమును చెడుచే నింపెను, ఉదా: యుద్ధములు, ఒకరిని ఒకరు అణచివేయవలె నన్న స్థితి, పగిలిపోయిన సంబంధాలు, యిట్లు ఎన్నో దు:ఖకరమైన సంఘటనలు మానవ జీవితములను నాశనము చేయుచున్నవి. దీనిని బట్టి దేవుడు మనలను పాపులుగా సృష్టించలేదు, గాని ఆదాము పాపమును బట్టి లోకమిట్లు మారినదని చెప్పుచున్నావు గదా యని అహ్మద్ ఆశ్చర్యపడెను.

అవును సరిగా అదే జరిగినది. ఆదాము ద్వారా పాపము మానవుని చేరెనని హమ్ది జవాబిచ్చెను.

"ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, అలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్త మాయెను" (రోమా 5:12)

దీని భయంకర ప్రతిఫలము మరణము. భౌతిక, ఆత్మీయ మరణము.

భౌతిక, ఆత్మీయ మరణమా? యని హమ్దిని ప్రశ్నార్థకముగా అహ్మద్ చూడసాగెను. అయితే ఆత్మీయ మరణమనగా నేమి?

మంచిది, పండు తిన్న దినమున నిశ్చయముగా చచ్చెదవని దేవుడు చెప్పెను.

దేవుడు నీతిమంతుడును ఆయన మాటను బట్టి కార్యము చేయువాడై యున్నందున మరణము నరులపై ప్రభావము చూపుచున్నది గనుక అందరు మరణమునకు దాసులైరి. పాపము చేసినందున ఆత్మీయముగా మృతుడాయెను.

ఎట్లు ? అహ్మద్ ఆశ్చర్యపడెను.

అవును. పాప ఫలితముగా నరుడు పరదైసునుండి బయటకు గెంటి వేయబడెను. తాను దేవునితో కలిగియున్న పవిత్ర బంధము తెగిపోయెను. గనుక పరదైసునకు వెలుపలనే నరుడు జీవనము సాగించు వాడాయెను. పాపమును బట్టి నరుడు ఆత్మీయంగా మృతుడై, సజీవుడైన దేవుని నుండి వేరైపోయెను, పాపము దాని దుష్టత్వము నరజాతిని దేవుని నుండి వేరుచేసెను. పాపమును బట్టి దేవునితో సాధారణ సహవాసమును సహా కోల్పోతిమి. పరమ పవిత్రుడైన దేవుడు పాపముతో సంబంధము కలిగి యుండజాలడు. అందుకే మన పాపము వలన కలిగిన సమస్త స్థితి నుండి రక్షించుటకు మనకు రక్షకుడు అవుసరమైయున్నాడు. అహ్మద్! పాపములు వ్రాయబడి భద్రపరచబడి యున్నవని నమ్ముదువా?

అందుకు అహ్మద్ - కొంత కలవరము చెందినట్లు అగుపడి - యిరువురు దూతలు ప్రతివారి పాపములను నమోదుచేయు చున్నట్లునేనురుగుదునని జవాబిచ్చెను హమ్ది - అవును - మన సమస్త విషయములను దేవుడు ఎరిగి యున్నాడు. మన సమస్త మంచి లేదా చెడు కార్యములను, ప్రతి మాట ప్రతి తలంపు, ఉద్దేశ్యము (నేయా). దేవుడు అన్నిటిని వ్రాయించి యున్నాడు. తీర్పు దినమున జీతము ఎట్లుండునో నీ వెరుగుదువా? (యామ్/ అల్/హిసబ్)? లేదు. దేవుడే సమస్తము నెరుగునని అహ్మద్ మెల్లని స్వరముతో జవాబునిచ్చెను. వెంటనే హమ్ది - అహ్మద్! దేవుడు నిన్ను ప్రేమించు చున్నాడు. మరియ పుత్రుడైన దేవుని గొఱ్ఱెపిల్ల నీ సమస్త పాపమును ఆయనపై వేసికొనెను. ప్రతి దానికి క్షమాపణ దొరుకును. అహ్మద్ కొంచెము ఆగియిట్లనెను- మెషయా యింతగా అవుసరమైయుంటే, ఆదాము - హవ్వలు యీ వార్తను విని యుండలేదు.

మెషయాను గూర్చిన వార్త వారు విని యున్నారన్నచో నీవు నా మాట నమ్మగలవా? యని హమ్ది యనెను. అందుకు అహ్మద్ నమ్మలేను. ఎందుకనగా అట్టి అనుకూలత వారికి లేదు. దేవుడు నరులను ప్రేమించి, ఆయనతో వారు సహవాసము కలిగి యుండవలెనని దేవుడు కోరుచున్నాడు. అందుకే ఆది నుండి మెషయాను గూర్చి తెలియజేసెను. ఇబ్బంది కరమైన స్థితి యందున్నపుడే, ఆదాము - హవ్వలు విమోచకుని గూర్చిన వాగ్దానము అనగా ఆయన అపవాదితలను చితక ద్రొక్కునని, వారు వినుచుండగానే దేవుడు సాతాను హెచ్చరించెను.

"నీకును స్త్రీకిని, నీ సంతానమునకును
స్త్రీ సంతానమునకును వైరము కలుగజేసెదను.
అది నిన్ను తలమీద కొట్టును, నీవు దానిని
మడిమ మీద కొట్టుదువని చెప్పెను. (ఆది 3:15)

బైబులునందు కుమారులు తండ్రి పేరును బట్టి పిలువబడిరి. అబ్రహాము కుమారుడు, యాకోబు కుమారుడు మొ॥. అయితే యీ సందర్భమందు మాత్రం స్త్రీ సంతాన మనెను గాని పురుష సంతాన మనలేదు. తండ్రి లేని వాడును, స్త్రీ సంతానమైన వారును రావలెను. ఈ కుమారుడు నరునిపై అపవాది చూపు శక్తి సామర్థ్యతలను తుత్తునియలు చేయును. అట్లే అపవాది సర్పముగా స్త్రీ సంతానము మడిమెను కొట్టుట ద్వారా నాశనము చేయనెంచెను. సిలువలో మరియ కుమారుడైన క్రీస్తు మానవపాప పరిహారార్థ బలి చేయుట ద్వారా యీ కార్యము అక్షరాలా నెరవేరెను?

ఆహా! యిదెంతో అద్భుతము - అని అహ్మద్ చెప్పుచూ, దేవుడు ఆది నుండి మెషయాను గూర్చి మాట్లాడుట ఎంతో ఆశ్చర్యము. దీనిని బట్టి బైబిలు ముఖ్యముగా చెప్పునది మెషయాను గూర్చియే! మరలా మనము కలిసి కొనుటకు ముందు ఆలోచించుటకు నాకెన్నో విషయాలు తెలియజేశావని హమ్దియనేను. "అల్-సలామో ఆలెయాకం, ఆలేయాకం- అల్ సలాం"

# అబ్రహాము కుమారుడు

## The Son of Abraham

అహ్మాద్! సువార్తను (అల్-యింజిల్ ) గూర్చి నీ ఉద్దేశ్యమేమిటో తెలుసుకొన ఉపేక్షించుచున్నానని హమ్ది అనగా- నిజమునకు యీ గ్రంథము అద్భుతము, మహాద్భుతము, మరే యితర గ్రంథము దీనికి సమము కాజాలదు. మెషయా చేసిన అద్భుతములు, సూచక క్రియలను గూర్చి పఠించుట ఎంతో ప్రోత్సాహముగానున్నది. ఆయన ఉపదేశము కొంత ప్రసంగము చెప్పనశక్యము. అయన చెప్పినది స్పష్టముగాను లోతుగానున్నది. మన శత్రువులను ప్రేమించి మనలను శ్రమపెట్టువారి కొరకు ప్రార్థించుటను గూర్చి చెప్పిన సందర్భములో మన తలంపులను తలక్రిందులు చేసియున్నాడు. నేనిది వరకు వినిన వాటిన్నిటిలో ఆయన ప్రార్థించుటను గూర్చి చెప్పిన సంగతులు ప్రత్యేకములు. ఈ గ్రంథము నాపై లోతైన ఒప్పుదల నిచ్చుటతో బాటు, నాలో తలెత్తు ప్రతి క్రొత్త ప్రశ్నకు అందే తగిన జవాబు నొందుచున్నాను.

హమ్ది నవ్వుతూ - ఆహా నీ మాటలు ఆసక్తిని రేకెత్తించుచున్నవి. నీ మొదటి ప్రశ్నతో నేటి సంభాషణ ప్రారంభింతుము.

మంచిది, అబ్రహాము నుండి దావీదు, దావీదునుండి మెషయాను సువార్త సూచించుటలో గల వంశ విధానము ముడిపడి యుండుటకు కారణమేమి?

కొంత ఆలోచించిన తదుపరి హమ్ది యిట్లడిగెను- మనము గతసారి సంభాషించినపుడు, బైబిలు నందు ఒకే అంశము ప్రతి పుస్తకమునందు కొనసాగిన విషయము నీకు జ్ఞాపక మున్నదా?

అవును, నాకు జ్ఞాపకమున్నదని అహ్మాద్ చెప్పెను.

ఆ అంశము గుర్తున్నదా? (హమ్ది)

అల్ మెషయా -అహ్మాద్ జవాబు.

హమ్ది - నీ ప్రశ్నకు సమాధానము ఆ అంశముతో ముడిపడి యున్నది. ప్రవక్తల వచనమును బట్టి, మెషయా దావీదు కుమారుడును, అబ్రహాము కుమారుడునై యుండవలెను.

అహ్మాద్ -హమ్ది తనతో చెప్పిన సంగతులను కొంచెముసేపు యోచించి

నీవు చెప్పినది చాలా ఆసక్తి కరముగా నున్నది. అయితే ఆయా ప్రవక్తల వచనములను గూర్చి మరి కొంత వివరించగలవా? కొంత సమయము దొర్లిన తదుపరి హమ్డి చెప్పసాగెను - ఒకనాడు, దాదాపు నాలుగు వేల సంవత్సరములకు ముందు దేవుడు అబ్రహాముతో మాట్లాడెను. అబ్రహాము దేవునికి స్నేహితుడుగా పిలువబడెను. అబ్రహాము యింకా అబ్రాముగా నున్నపుడే దేవుడు వాగ్దానము చేసి, ప్రజలందరికి అది సంబంధించినదిగా చెప్పెను. తోరా (పంచ గ్రంథము) లో దీనిని చూడగలము.

" అబ్రహాముతో - నీ దేశమును, నీ ప్రజలను నీ తండ్రి యింటిని విడిచి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నేను నిన్ను గొప్ప జనముగా చేసెదను, నిన్ను ఆశీర్వదించెదను, నీ నామమును గొప్ప చేసెదను, నీవు ఆశీర్వాదముగా నుందువు.

నిన్ను ఆశీర్వ దించు వారిని నేను ఆశీర్వదించెదను. నిన్ను శపించు వారిని నేను శపించెదను. భూమిమీద ప్రజలందరు నీయందు ఆశీర్వదించబడెదరు (ఆది 12:1-3).

"వివాహమై చాలా సంవత్సరములు పిల్లలు లేని ఒకనిని దేవుడు పిలిచెను. దేవుడు తనకు భూమిని వాగ్దానము చేసెను. గొప్ప జనముగా చేయుదునని వాగ్దానము చేసెను. అతని నామమును గొప్ప చేసి అనేకులకు తెలియ వచ్చెదననెను. ఇదంతయూ దేవుడు నెరవేర్చెను ఈ వాగ్దానములన్నిటిలో విశేషమైన దేమనగా, అబ్రహామును బట్టి భూమి మీద ప్రజలందరిని ఆశీర్వదించెదనన్నదే! ఈ వాగ్దానములోనే మెషయా యిమిడి యున్నాడు. గనుక మెషయా అబ్రహాము కుమారుడు కావలెను. ఆయన ద్వారా భూమి యొక్క సమస్త వంశములను ఆశీర్వదించగోరెను.

అహ్మద్ - ఈ వాగ్దానము మరెవ్వరికో గాక మెషయాకే చెందినదిగా నీవెట్లు ఎరుగుదువు? అని ఆశ్చర్యపడెను.

హమ్డి- తొరాను జాగ్రత్తగా పఠించినచో సాగు కొలది యీ విషయము మనకు స్పష్టముగా అర్థమగును. తదుపరి అబ్రహామునకు యిరువురు కుమారులు కలిగిరి ఒకరు (ఇస్సాకు)శారాకు కలిగెను. మరియొకరు శారా పని మనిషియైన హాగరునకు కలిగెను. అతడు ఇష్మాయేలు. దేవుడు ఇష్మాయేలును దీవించినప్పటికి, ఇస్సాకు పుట్టుకముందే, మెషయాను గూర్చిన వాగ్దానము ఇస్సాకు నందే నెరవేరునని స్పష్టీకరించెను.

"దేవుడు - నీ భార్యయైన శారా నిశ్చయముగా నీకు కుమారుని కనును, నీవతనికి ఇస్సాకు అని పేరు పెట్టుదువు: అతని తరువాత అతని సంతానము కొరకు నిత్యనిబంధనగా నా నిబంధనను అతనితో స్థిరపరచెదను. ఇష్మాయేలును గూర్చి నీవు చేసిన మనవి వింటిని, ఇదిగో నేనతనిని ఆశీర్వదించి, అతనికి సంతానాభివృద్ధి కలుగజేసి అత్యధికముగా అతని విస్తరింప జేసెదను : అతడు పండ్రెండు మంది రాజులను కనును అతనిని గొప్ప జనముగా చేసెదను. (ఆది 17:19-20)

అహ్మద్ - అవును ఇష్మాయేలును దేవుడు దీవించెను. అరబ్బులమైన మనకు ఆయన తండ్రి. అయితే మహమ్మదీయులమైన మనకు తెలిసినది - దేవుడు ఇస్సాకు నుండి అపోస్తలులను, ప్రవక్తలను పంపెను.

హమ్ది- యిట్లు చెప్పసాగెను - ఇస్సాకునకు యిద్దరు పుత్రులు ఏశావు, యాకోబు. అయితే మెషయా యాకోబు నుండి కలుగునని దర్శనమందు బయలు పరచెను.

"యెహోవా - నేను నీ తండ్రియైన అబ్రహాము దేవుడను, ఇస్సాకు దేవుడైన యెహోవాను, నీవు పండుకొని యున్న యీ భూమిని నీకును నీ సంతానమునకు నిచ్చెదను. నీ సంతానము భూమి మీద లెక్కకు ఇసుక రేణువులవలె నగును నీవు పడమర తట్టును, తూర్పు తట్టును, ఉత్తరపు తట్టును - దక్షిణపు తట్టును వ్యాపించెదవు. భూమి యొక్క వంశములన్నియు నీ మూలముగాను, నీ సంతానము మూలముగాను ఆశీర్వదించబడును (ఆది 28:13-14).

హమ్ది - దేవుడు యాకోబుతో మాట్లాడినప్పుడు, అబ్రహామునకు మెదటిదిగా చేసిన వాగ్దానములో పలు అంశములను మరలా యాకోబుతో చెప్పెను.

నిజముగా అదే వాగ్దానము తరతరములకు చెందినదిగా విస్తరించెను. అయితే యాకోబు సంతానమందు దేవుడు భూ ప్రజలను ఆశీర్వదించ గోరెను గమనించితివా?

అహ్మద్ - నవ్వుచూ, అవును. మరలా మెషయాయే బైబిలు ముఖ్య అంశముగా నిరూపించబడుచున్నట్లు నాకును తోచుచున్నది.

హమ్ది - అవును అది నిజమే! ఇశ్రాయేలు సంతాన మందు (బని ఇశ్రాయిల్) ఎన్నో కుటుంబములు గలవు. అయితే ప్రశ్న ఏమనగా -

ఏ కుటుంబము నుండి మెషయా రావలెనని దేవుడు ఉద్దేశించాడన్నదే! దేవుడు దావీదును (సయెద్నా దావూద్) ఎన్నుకొని తనతో నిబంధన చేసి యున్నాడు. ఈ విషయమును అనేక ప్రవచనముల ద్వారా దేవుడు బయలు పరచియున్నాడు. దావీదు తర్వాత దాదాపు 200 సంవత్సరములకు ప్రవక్తయైన యెషయా ప్రవచన ప్రకారము "యెష్షయి మొద్దునుండి చిగురు పుట్టవలెను". దావీదు తండ్రి యెష్షయి (జేస్సీ). ఆ కుటుబము నుండి వచ్చు ఒకనిపై దేవుని ఆత్మ నిలిచియుండును. భూలోకంలో పేదలకు ఆయన న్యాయము చేకూర్చును. ఆయన వరదైనును పోలిన దైవరాజ్యమును స్థాపించును. అందు ప్రవేశించిన వారందరు ఆయనను ఎరిగి యుందురు. యెషయా యిట్లు వ్రాసెను-

"యెష్షయి మొద్దు నుండి చిగురు పుట్టును, వాని వేరుల నుండి అంకురము ఎదిగి ఫలించును: యెహోవా ఆత్మ జ్ఞాన వివేకములకు ఆధారమగు ఆత్మ ఆలోచన బలములకు ఆధారమగు ఆత్మ తెలివిని యెహోవా యెడల భయభక్తులను పుట్టించు ఆత్మ అతని మీదనిలుచును."

"నీతిని బట్టి బీదలకు తీర్పు తీర్చును"

భూ నివాసులలో దీనులైన వారికి యదార్థముగా విమర్శచేయును"

" ఆ దినమున ప్రజలకు ధ్వజముగా నిలుచుచుండు యెష్షయి వేరు చిగురు నొద్ద జనములు విచారణ చేయును. ఆయన విశ్రమస్థలము ప్రభావము గలదగును" (యెషయా 11:1,2,4,10).

అహ్మద్ - నాకు యీ అర్హతయున్నదో లేదో చూడవలెను. దేవుని ప్రత్యక్షతను బట్టి మెషయా, అబ్రహాము ఇస్సాకు, యాకోబు మరియు దావీదు కుమారుడుగా పిలువబడునని క్లుప్తముగా హమ్ది పెద్దనవ్వుతో జవాబిచ్చెను.

మెషయా ప్రవచనములను బట్టి మాత్రమే జన్మించవలసియున్నాడని సువార్తలు సహా తెలుపుచున్నవి. అందుకే సువార్తలు వంశ క్రమమును తెలియజేయుచున్నవి. మెషయా, అబ్రహాము, దావీదులకు కుమారుడని నిరూపించుచున్నవి.

అందుకు అహ్మద్- మరియొకసారి మనకు యేసు మరియ కుమారుడని రూఢి పర్చుచున్నది. హమ్ది నీవు గ్రహించి యుందువు, నాలో మరిన్ని ప్రశ్నలున్నవి - మరి యొకసారి వాటిని గూర్చి యోచింతము

"అల్ - సలామో - అలెకాం"

"అలెకాం - అల్ సలామ్"

# దేవుడు ఒక్కడే

## God is One

అహ్మద్ : గాలిలో తన మూడు వ్రేళ్ళను చూపుచూ నీ వేమి చూచుచున్నావని హమ్జిని ప్రశ్నించెను.

హమ్జి :అహ్మద్ ఆలోచన నెరిగి నేను మూడు వ్రేళ్ళను చూచుచున్నాననెను.

అహ్మద్ : దేవుడు ఒకరా లేక ముగ్గురా? నీవు దేనిని నమ్ముచున్నావు? అందుకు-

హమ్జి : నా నమ్మకమును నీవు సరిగా గ్రహించలేవని తలంచుచున్నాను. అయితే నేను ఒకే సత్యవంతుడైన దేవుని నమ్ముచున్నానని నీవు అర్థం చేసికొనాలి. ఆయన భూమ్యాకాశములను సృజించినాడు. ఆయన ఏమైనా చేయగలడు, సమస్తము నెరిగి యున్నాడు, ఆయన సర్వాంతర్యామియై యున్నాడు. నా విశ్వాసము బైబిలు నాధారము చేసికొనియున్నదని నీ వెరుగుదువు. అయితే దేవుడు ఒక్కడేయని బైబిలు చెప్తోంది. ఈ సత్యమును బైబిలు అంతటిలో చూడగలము.

అహ్మద్ : దేవుడు త్రిత్వమై యుండి ఒక్కడే ఎట్లు ఒకేసారి కాగలడు ? మరలా తన మూడు వ్రేళ్ళు మూడునే చూపును గాని 1+1+1 మూడు సమానముగా నుండి మూడునే చూపును గాని "ఒకటి" కాజాలదుగదా?

హమ్జి : నీవు ఎందరు అహ్మద్లవై యున్నావు. నీవు ఒకటా లేక రెండా?

అహ్మద్ : అవును, నేను ఒక్కడినే!

హమ్జి : దేవుడు శరీరము ఆత్మయు గల వ్యక్తిగా సృష్టించెను నీ శరీరమే అహ్మదా?

అహ్మద్ : అవును.

హమ్జి : అయితే నీ ఆత్మ విషయమేమి? ఆ ఆత్మ అహ్మద్ అగునా?

అహ్మద్ : హమ్జి యింకేదో చెప్పనున్న తలంపుతో - మంచిది - నాకట్లే తోచుచున్నదనెను.

హమ్జి : మనలను ఒకరిలోనే యిద్దరు (శరీరము + ఆత్మ) గా నుండు వ్యక్తిత్వమును సృష్టించిన దేవునికి ఒక్కరిలోనే మూడు (ముగ్గురు)

వ్యక్తిత్వములుండుట అసాధ్యమా? కొంచెము ఆగి హమ్ది యిట్లనెను - దేవుడు సంపూర్ణ ఐక్యతతో నిండిన మూడు వ్యక్తులుగా తన్ను తాను ప్రత్యక్ష పర్చుకొని యున్నాడు. పెద్ద విశేషమేముంది ? 1×1×1, అహ్మద్ ఏమగును?

అహ్మద్ : ఒకటి. (నెమ్మదిగా చెప్పెను) అయితే మరియ పుత్రుడు మనుష్యుడే గాని దేవుని కుమారుడు కాజాలడు. (హమ్ది వైపు అదోలా చూచు చుండెను). మెషయా దైవకుమారుడని నమ్ముచున్నావా? అని హమ్దిని అడిగెను.

హమ్ది : నా నమ్మకమును గూర్చి నీవు ఏమను కొనుచున్నావు?

అహ్మద్ : నాకైతే సరిగా తెలియక పోవచ్చును గాని, దేవుడు కన్య మరియతో కలిగి యున్న శారీరక సంబంధమును బట్టి వారికి కుమారుడు కలిగెనని నీ నమ్మకమని తలంచుచున్నాననెను. అస్తాఫర్ అల్లా ( దేవుని క్షమాపణ కోరుచున్నాను).

హమ్ది : నా నమ్మకము అదెంత మాత్రము కాదు. అంతే గాక మెషయాను అనుసరించు వారెవ్వరూ అట్లు తలంచరు సుమా!

అహ్మద్ : ఆశ్చర్యంతో - అయితే నీ నమ్మకమేమి ?

హమ్ది : దేవుడు నిత్యుడు. సమస్త సృష్టికి ముందున్నవాడు. అంతేకాదు - మెషయా ఎవరో సువార్త బయలు పర్చినప్పుడు, ఆయన యీ లోకంలో పుట్టుటతో ప్రారంభించక, దేవుడు లోకమును సృష్టించక మునుపు నిత్యత్వము నుండి ప్రారంభించబడెను - సువార్తలో యిట్లు వ్రాసెను -

" ఆది యందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్దనుండెను. వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్దనుండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగి యున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు (యోహాను 1:1-2)

ఆయనలో జీవముండెను..... (1:4)

దేవుడు లోకమును ఆయన మాట ద్వారా సృజించెను. కాదా?

అహ్మద్ : అవును. అది నిజమే. దేవుడు, యిది జరుగును గాకనెను, అట్లు జరిగెను (కాన్ ఫా యాకోన్).

హమ్ది : దీనిని బట్టి దేవుడు తన మాట ద్వారా లోకమును సృజించెను. మరియు యీ వాక్యము, దేవుని నుండి వచ్చినది, దేవునిలో

భాగమై యుండి, దేవుడు కలిగియున్న సృష్టించు శక్తిచే నింపబడి యుండుటే గాక, అయన సమస్త లక్షణములు కలిగి యుండెను. దేవుని వాక్యమందు జీవముండుటచే, ఆ వాక్యము వెలువడిన ప్రతి స్థలములో జీవము ఆయా రీతులుగా సృష్టి కార్యమును జరిగించెను.

అహ్మద్ : అవును. నేనది అంగీకరించుచున్నాను. అయితే వాక్యము దేవుడై యుండెననగా నేమి?

హమ్జి : నేను న్యాయస్థానంలో సాక్ష్యమియ్యవలసి వచ్చినచో, నన్ను నేను చెప్పుమాటలనుండి వేరుచేయజాలవు. నా మాటలు నన్ను చూపు చున్నవి గనుక నాలో భాగమై యున్నవి. మనము యిక్కడ కూర్చుండి సంభాషించుచుండగా, మన మాటలు మన నుండి వెలువడి మనలో భాగముగానుండి మనలను చూపుచున్నవి. అట్లే దేవుడు లోకమును సృష్టించినపుడు, తానుచ్చరించిన మాట ఆయనతో ఏకమైయుండెను. దేవుని ఆయన వాక్యము నుండి వేరు చేయజాలము. ఈ శాశ్వత దేవుని వాక్యము ఆయనతో ఏకమై ఆయన స్వభావ లక్షణములు గలదై, యేసు నందు అనగా మరియ కుమారుని యందు ప్రత్యక్షమాయెను - వ్రాయబడినట్లు -

"ఆ వాక్యము శరీర ధారియై మనమధ్య కృపా సత్య సంపూర్ణుడుగా నివసించెను తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమ వలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:14).

దేవుడు తనను గూర్చి చెప్పిన ప్రతీమాట, ఆయన స్వభావ లక్షణములు, మెషయా యందు ప్రత్యక్ష మాయెను. ప్రజలు మెషయా పరిశుద్ధతను గాంచుటతోనే దేవుడెంత పవిత్రుడో గ్రహించగలరు. మెషయా ప్రేమను చూచుట ద్వారా దేవుడు ఎంత ప్రేమామయుడో ఆయన యందు చూడగలరు. దేవుడు ఏమైనా చేయగలడు. ఆయన సర్వశక్తుడు. మెషయా నీటిపై నడచి తుఫానును గద్దించి, గాలిని, అలలను నిమ్మళింపజేసి, రొట్టెలను విరచి వృద్ధిచేసి, గ్రుడ్డి వారికి చూపు, మరియు మృతులను లేవ నెత్తినపుడు దేవుని శక్తిమహిమ మెషయా యందు ప్రత్యక్ష పరచబడెను.

"అయితే, దేవుడు ఎట్లు సర్వంతర్యామి గదా. నరునిగా తనకెట్లు పరిధిని విధించుకొనగలడు? ఆహ్మద్ యీ విషయమును నొక్కి అడిగెను. మెషయాగా నున్నపుడు దేవుడు యీ ప్రపంచమును మరచెనా?

హమ్జి : అహ్మద్, మనము మహాసముద్రముపై పయనించుచూ, అందు ఒక గ్లాసును ముంచి నీటిని పట్టియున్నాము.

నీటిని విశ్లేషించినచో సముద్రములోని నీటి స్వభావమే గ్లాసులోని నీటికిని యందును గదా! మెషయా విషయమును అంతే! నిత్యుడు, సర్వశక్తుడైన దేవుడు సర్వాంతర్యామి. అదే సమయములో ఆయన సమస్త లక్షణములను, అధికారమును మెషయా యందు ప్రత్యక్షపరచెను. అయితే దేవుడు పరిధిలో నున్నవాడు కాదు, గాని మెషయా యందు ప్రత్యక్షుడాయెను. అయినను ఆయన అసమానుడే!

అహ్మద్ : ఏమైనా, దేవుడు ఒక మనుష్యుని యందు ప్రత్యక్షుడు కాడు.

హమ్ది : మనము దేవుని నెట్లు కుదించగలము ? సర్వశక్తునికి ఫలానిది అసాధ్యమని చెప్పగలము? ఆయన సమస్తమును నిర్వర్తించలేడా?

అహ్మద్ : అవును. ఆయన సమస్తము చేయగలడు. అయితే ఆయన నరుని యందు తన్ను అగపరచుకొనుట నమ్మలేకున్నాను.

హమ్ది : ఈ కార్యము మనకు అసాధ్యము గాని దేవునికి స్యామని అంగీకరించుచున్నాము. ఆయన తలంచిన దేదైనా చేయగలడు. ఒక విషయము తెలియని స్థితిలో - దేవుడు మండు పొదలో నుండి మోషేతో మాట్లాడినట్లు చెప్పినచో ఎట్లు నమ్మగలడు?

ఆలోచనలో మునిగిన అహ్మద్- ఒక పొదనుండి తన్ను ప్రత్యక్షపరచుకొనిన దేవుడు, ఒక నరుని యందు ప్రత్యక్ష పరచుకొనుట మరింత సులభము చిరునవ్వుతో అంగీకరించెను.

హమ్ది యింకను మాట్లాడుచు... అహ్మద్, కొంచెము యోచించు - దేవుని వాక్యము, దేవుని ఆత్మ (కలిమత్ అల్లా వారోహ్ అల్లా) యని పిలువబడిన వ్యక్తి ఎవరు ? దేవుని ఆత్మ దేవుడే గదా? దైవాత్మ కన్య మరియను ఆవరించెనని మన మెరుగుదుము. అందున ఆమె గర్భవతి యై మెషయాకు జన్మనిచ్చెను. గబ్రియేలు దూత యిదే చెప్పెను గదా!

"దూత - పరిశుద్ధాత్మ నీమదికి వచ్చును, సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును' ' (లూకా 1:35).

అయితే ప్రశ్న ఏమనగా, యీ రీతిగా లోకములో పుట్టిన వారెవరు ? అహ్మద్, మెషయా జన్మించినపుడు నీవు డాక్టరువై యుంటే, ఆయన పుట్టుకను గూర్చిన ధృవ పత్రము నియ్యవలసి యుండినచో, నీవు ఏమని వ్రాసి యుందువు ? ఆయన పేరేమి?

అహ్మద్ : బహుశా, నేను మరియ కుమారుడైన 'యేసు' అని వ్రాసి యుందును.

హమ్ది: తల్లి పేరు ?

అహ్మద్ : అవును. "కన్య మరియ"

హమ్ది : చిరునవ్వుతో, తండ్రి పేరును గూర్చి ఆలోచింతము.

అహ్మద్ : మరి గట్టిగా నవ్వుచూ ఆయనకు తండ్రి లేడు గదా!

హమ్ది : ఈ లోక సంబంధియైన తండ్రి లేనందున యీ విషయము ధృవపత్రములో ఖాళీగా నుంచెదము. అయితే, మనలో మనము యోచింతము - ఆయన ఎక్కడ నుండి వచ్చెను ? దేవుని వాక్యము మరియు దేవుని ఆత్మ అను ఆయన ఉనికి పట్టు ఏది? పరలోకము నుండి వచ్చిన వాని రుజువు ఏమి?

ఆయన యిట్లనెను -

"పరలోకమునుండి దిగివచ్చి, లోకమునకు జీవమునిచ్చునది దేవుడనుగ్రహించు ఆహారమై యున్నది....." జీవాహారము నేనే, నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు, నా యందు విశ్వాసముంచువాడు ఎన్నడును దప్పిగొనడు (యోహాను6:33,35).

"పరలోకము నుండి దిగి వచ్చిన జీవాహారము నేనే. ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును. మరియు నేనిచ్చు ఆహారము లోకమునకు జీవము కొరకైన నాశరీరము......(యోహాను 6:51)

అహ్మద్, ఆయన మానవ పాప పరిహారార్థమైన అర్పణగా ఆయన శరీరము నిచ్చుటకే యీ లోకమునకు వచ్చెను. అంతేగాక మనవలె రొట్టెను తినుట వలన భౌతిక శరీర రూపము కలవాడాయెను. మరియు పరలోకము నుండి దిగివచ్చిన జీవాహారమైనందున ఆత్మీయ రూపమును గలవాడాయెను. గనుక మెషయా యందు విశ్వసించి ఆయనతో పాలివారగు వారు, దేవుని గూర్చిన అంతరంగ మందలి దప్పిక తీర్చబడినవారై సంతుష్టి నొందుదురు. అదేనా వ్యక్తి గత అనుభవము. అహ్మద్, మెషయాయే దేవుడు నీకను గ్రహించిన వరము:

అహ్మద్ : నీవు చెప్పినట్లుగా నేనిప్పుడే దానికి సిద్ధపడిలేను. నా మదిలో ఎన్నెన్నో తలంపులు తిరుగాడుచున్నవి. నీవు దేవుని విశ్వసించిన విధానమును సరిగా గ్రహించకుంటివి. యిప్పుడిప్పుడే నీవు నిజ దేవుని అనగా మెషయాయందు అగపడిన దేవుని ఎట్లు విశ్వసించితివో గ్రహించుచున్నాను. అయితే నేను మెషయాను హృదయ మంతటితో ప్రేమింతునని నీ వెరుగుదువు. అయినా యింకెన్నో ప్రశ్నలు నన్ను వేదించుచున్నవి. మరలా కలిసినప్పుడు వాటిని ఆలోచించగలమా? అవునా హమ్ది?

హమ్ది : ఆ సమయము కొరకు నేను ఎదురు చూచు చున్నాను.

అల్ - సలాం- ఆలెయాకాం

ఆలెయాకాం - అల్ సలాం

# దేవుడు మరియు నరుడు
## God and Man

అహ్మద్ సంభాషణ ప్రారంభించుచూ, గతసారి మనం సంభాషించిన విషయములను రాత్రింబగళ్ళు యోచించుచుంటిని. ముందుగా - మరియ కుమారుడైన యేసు - నరుడని చెప్పితివి. తదుపరి దేవుడు ఆయన యందు ప్రత్యక్షుడై నాడంటివి. అయితే, ఆయన నిజముగా ఎవరో తెలిసికొన గోరుచున్నాను. ఆయన కేవలము మరియ పుత్రుడై యుండగా - దైవకుమారుడైన మెషయాగా చిత్రించుచున్నావు గావా?

హమ్దీ : అహ్మద్ ! ఈ ప్రశ్నకు జవాబు తెలుసుకొనాలంటే యిక పరసంభంధమైన శాశ్వత జీవితము దేవుని యందు పొందుటయనే తాళపు చెవితో ముడిపెట్టబడియున్నది. దానిని షర్క్ అంటారు (ఎవరినో దేవునితో సమముగా సరిపెట్టుట) అనగా ఒక మనుష్యుని దేవునితో సరిపోల్చుట అయితే బైబిలు ప్రభోధమును బట్టి దేవుడు తనను తాను నరుని యందు ప్రత్యక్ష పరచుకొనుట తప్ప వేరే మార్గమును చూపలేదు, మెషయా నరుడుగా జన్మించెనని మనిద్దరము అంగీకరించితిమి. ప్రవక్తల వచనములను బట్టి, ఆయన అబ్రహాము కుమారుడు, దావీదు కుమారుడు మరియు మరియ కుమారుడు. మెషయా జన్మించక ముందెన్నడో దేవుడు మెషయాగా రావలెనని చెప్పబడెను గదా!

అందుకు అహ్మద్ ఆశ్చర్యపడుచూ - అనగా అపోస్తలులు, ప్రవక్తలు ముందుగనే దేవుడు మెషయాగా ప్రత్యక్షమగునని చెప్పిరందువా?

అవును, బైబిలు ప్రధానాంశము మెషయా గనుక మెషయాను గూర్చిన సత్యమును ప్రవక్తలు ముందుగా ప్రవచించితనుట అతిశయోక్తి కానేరదని హమ్దీ చెప్పెను.

అహ్మద్ : అయితే అది నాకు నిరూపించుము. నాకెంతో ఆసక్తియున్నది.

హమ్దీ : కొంచెము యోచించి క్రీ.పూ. 700సం॥ల నాడే ప్రవక్తయైన మీకాకు, మెషయా "బేత్లెహేము" లో జన్మించునని బయలుపరచెను. అంతే ఆయన శాశ్వత కాలము జీవించిన వాడుగా, పుట్టకముందే వున్నవాడుగా చెప్పియుండెను.

"బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏల బోవువాడు నీలో నుండి

వచ్చును పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను" (మీ కా 5:2).

నిజముగా మెషయా - బేత్లెహేము నందు జన్మించెను. సువార్తల భాగము చూడుము-

"యోసేపు దావీదు వంశములోను, గోత్రములోను పుట్టినవాడు గనుక, తనకు భార్యగా ప్రధానము చేయబడి గర్భవతియై యుండిన మరియతో కూడ ఆ సంఖ్యలో వ్రాయబడుటకు గలిలయలోని నజరేతు నుండి యూదయలోని బేత్లెహేమన బడిన దావీదు ఊరికి వెళ్లెను. వారక్కడ ఉన్నప్పుడు ఆమె ప్రసవ దినములు నిండెను గనుక తన తొలి చూలు కుమారుని కని, పొత్తి గుడ్డలతో చుట్టి, సత్రములో వారికి స్థలము లేనందున ఆయనను పశువుల తొట్టిలో పరుండ బెట్టెను. (లూకా 2:4-7).

అయితే ప్రశ్న ఏమనగా - ఈ లోకమందు జన్మించక ముందు వారెవరు? యూదులలో బహు నిష్ఠాపరులైన పరిసయ్యులతో సంభాషించుచు తనను గూర్చి తానే యిట్లు చెప్పెను :-

"మీ తండ్రియైన అబ్రహాము నా దినమును చూతునని మిగుల ఆనందించెను, అది చూచి సంతోషించెననెను."

అందుకు యూదులు - నీకింకను ఏబది సంవత్సరములైన లేవే, నీవు అబ్రహామును చూచితివా అని ఆయనతో చెప్పగా-

యేసు - అబ్రహాము పుట్టక మునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను (యోహాను 8:56-58).

అహ్మద్ : అబ్రహాము 2000 క్రీ.పూ. జీవించెనని మన మెరుగుదుము.

అయితే మెషయా అబ్రహాము కంటె ముందున్నవాడేనని చెప్పియుండెను. అయితే ప్రవక్తల వచనములను బట్టి దేవుడు మెషయాయందు ప్రత్యక్షము కావలసి యుండెనుగదా?

అది అనేక స్థలములలో వ్రాయబడి యుండెనని హమ్ది చెప్పెను. మెషయా ప్రవచనమును బట్టి, మరియ కుమారుడైన యేసు పుట్టి పెరిగినట్టి స్వల్ప ప్రదేశము వంటి ప్రాంతమునుండి రావలసి యుండెను. అతడు శాశ్వత రాజ్యమును దేవుని సమాధానము నివసించు రాజ్యమును స్థాపించును. అతడు దావీదు కుమారుడై యుండును. ఆ రాజ్యమును శాశ్వత కాలము పాలించవలెను.మెషయా స్వభాష లక్షణములను ప్రవక్త

విభిన్న నామములతో విశదపరచెను.

" ఏలయనగా మనకు శిశువు పుట్టెను
మనకు కుమారుడు అనుగ్రహింపబడెను.
ఆయన భుజము మీద రాజ్యభారముండును.
ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు
నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును.

ఇది మొదలుకొని మితి లేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు
సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును
న్యాయము వలనను నీతి వలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్య పరిపాలన చేయును (యెషయా 9:6:7)

దేవుడు నరులకిచ్చిన ప్రతి నామమునకు అర్థమున్నది అది ఆ మనుష్యుని గుణమును తెలుపును : అహ్మద్ ఆశ్చర్యకరుడు, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి యని పేరు ఎవ్వరికి, ఎవ్వరు యిచ్చెను?

అవును, ప్రవక్తలు ప్రవచించిన మెషయా చిత్రము నాకళ్లముందు ప్రత్యక్షమగు చున్నది. అయితే తాను కలుగజేసిన సృష్టిలోనికి దేవుడు వచ్చునా? యని అహ్మద్ ప్రశ్నించెను.

హమ్డి : స్థానికుడైన యోహాను- (యాహ్యా అబ్నె జకరియా) మెషయా దినములలో జీవించెను. మెషయా మార్గమును సరాళము చేయుటకు అతడు దేవునిచే పంపబడెను. ఎందుకనగా ప్రజలు పశ్చాత్తాప్తులై విశ్వాసము నందు యేసును చేరుటకు యోహానును నీవెవరవని అడిగినప్పుడు, యెషయ 40వ అధ్యాయము నెత్తి అతడు జవాబిచ్చెను -

"ఆలకించుడి, అడవిలో ఒకడు ప్రకటించుచున్నాడు ఎట్లనగా - అరణ్యములో యెహోవాకు మార్గము సిద్ధపరచుడి ఎడారిలో మా దేవుని రాజ మార్గము సరాళము చేయుడి
ప్రతి లోయను ఎత్తు చేయవలెను
ప్రతి పర్వతమును కొండను అణచవలెను
వంకరివి చక్కగాను, కరుకైనవి సమముగాను ఉండవలెను.

యెహోవా మహిమ బయలు పరచబడును
ఒకడును తప్పకుండ సర్వ శరీరులు దాని చూచెదరు"(యెషయ 40:3-5).

ప్రవక్తయైన యెషయా మాటలలో గొప్పరాజు రానున్నాడన్నది ధ్వనించుచున్నది. ప్రజలు ఎడారిలో ఆయనకు తిన్నని మార్గము సిద్ధపరచ వలెననియు కన్పించుచున్నది.

అయితే - దర్శించు యీ రాజు ఎవ్వరు? అహ్మద్?

నిజమే ప్రవక్తను బట్టి ఆయన ప్రభువైన మన దేవుడేనని అహ్మద్ మెల్లగా జవాబిచ్చెను. హమ్ది యిట్లు చెప్పసాగెను - ఆ ప్రతిబింబము మరి స్పష్టముగా కన్పించుచున్నది. లేకనమును చూచినచో -

"సీయోనూ, సువార్త ప్రకటించుదానా
ఉన్నత పర్వతము నెక్కుము
" యెరూషలేమా, సువార్త ప్రకటించుదానా
బలముగా ప్రకటించుము, భయపడక ప్రకటింపుము
- ఇదిగో మీ దేవుడు అని యూదా పట్టణములకు ప్రకటింపుము.

ఇదిగో తన బాహువే తన పక్షమున ఏలుచుండగా ప్రభువగు యెహోవా తానే శక్తి సంపన్నుడై వచ్చును.

ఆయన యిచ్చు బహుమానము ఆయన యొద్దనున్నది
ఆయన చేయు ప్రతికారము ఆయనకు ముందుగా నడచుచున్నది
గొఱ్ఱెల కాపరివలె ఆయన తన మందను మేపును
తన బాహువుతో గొఱ్ఱెపిల్లలను కూర్చి రొమ్మున ఆనించుకొని మోయును
పాలిచ్చు వాటిని ఆయన మెల్లగా నడిపించును (యెషయ 40: 9-11)
మెషయా విశ్వాసులందరికి కాపరిగా నుండుటకు వచ్చును.

"నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని : మంచి కాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణము పెట్టును" (యోహాను 10:11).

అయితే, అహ్మద్ ప్రవక్త వచనమును బట్టి గొఱ్ఱెల కాపరిగా రావలసిన యితడెవరు?

అహ్మద్ : నాకర్థమగుచున్నదానిని బట్టి, ప్రవక్త మాటలు రూఢి పర్చు దానిని బట్టి ఆ గొఱ్ఱెల కాపరి ప్రభువైన దేవుడే తప్ప మరెవ్వరు కాదు.

హమ్ది : నీవు గ్రహించినట్లే మెషయాను గూర్చి చెప్పబడిన ప్రవచనములు కన్య మరియ పుత్రుడైన యేసు నందు నెరవేరెను. మెషయా జన్మించక ముందు, గాబ్రియేలు దూత, యోహానుకు తండ్రి కావలసిన జకర్యా

యొద్దకు వచ్చెను. తనకు కుమారుడు జన్మించుననియు, ఆయన చేయవలసిన ప్రత్యేక కార్యమును గూర్చియు చెప్పెను-

"తన తల్లి గర్భమున పుట్టినది మొదలుకొని పరిశుద్ధాత్మతో నిండు కొనినవాడై, ఇశ్రాయేలీయులలో అనేకులను ప్రభువైన వారి దేవుని వైపునకు త్రిప్పును. మరియు అతడు తండ్రుల హృదయములను పిల్లల తట్టునకును, అవిధేయులను నీతి మంతుల జ్ఞానము ననుసరించుటకును త్రిప్పి, ప్రభువు కొరకు ఆయత్తపడియున్న ప్రజలను సిద్ధపరచుటకై ఏలీయా యొక్క ఆత్మీయ శక్తియు గలవాడై ఆయనకు ముందుగా వెళ్ళును (లూకా 1:14-17)

అహ్మద్, సువార్తలో చెప్పబడినట్లు ముందుగా నడచిన వారెవరు? స్నానికుడైన యోహానే గదా?

"ప్రభువైన వారి దేవుడు - అని అహ్మద్ జవాబిచ్చెను. అందుకు హమ్డి స్నానికుడైన యోహాను పుట్టక ముందే జెకర్యా ప్రవచించెను-

"మరియు ఓ శిశువా, నీవు సర్వోన్నతుని ప్రవక్తవనబడుదువు.

మన దేవుని మహా వాత్సల్యమును బట్టి వారి పాపములను క్షమించుట వలన తన ప్రజలకు రక్షణ జ్ఞానము ఆయన అను గ్రహించునట్లు, ఆయన మార్గములను సిద్ధపరచుటకై నీవు ప్రభువునకు ముందుగా నడుతువు....... ఆయన మనకు అరుణోదయ దర్శనమను గ్రహించెను (లూకా 1:76-79). అహ్మద్, ప్రవక్తయైన యెషయాను బట్టి గాబ్రియేలు దూత జెకర్యా యొద్దకు వెళ్ళుట, యోహ్యా అబ్ని జికరియా ప్రభువునకు ముందు నడువవలెనని చెప్పెనుగదా! ఆ ప్రభువు దేవుడే గదా? యని హమ్డి అడిగెను. అవును, మెషయా వచ్చుట ద్వారా యివన్నియు నెరవేరెను అని అహ్మద్ గంభీరముగా చెప్పెను. అందుకు హమ్డి - దావీదు గ్రామమైన బెత్లెహేములో కన్య మరియ మెషయాకు జన్మనిచ్చినప్పుడు, ప్రభువు దూత కొందరు గొఱ్ఱెల కాపరులకు అగుపడి యిట్లనెను-

" భయపడకుడి ; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోష కరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను - దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు- (లూకా 2:10-11)

సువార్తలలో క్రీస్తే మెషయాయైన ప్రభువుగా పదేపదే రూఢి యాయెను. ఆయన మాటలు గమనించుము-

"నేనును తండ్రియు ఏకమైయున్నాము" (యోహాను 10:30)

నేను మరియ కుమారుడైన క్రీస్తునందు గొప్ప ప్రేమాభిమానములు కలిగి యున్నాను. అయితే నా జీవితములో మొదటిసారిగా - మెషయా యనగా నెవరో, యీ లోకమందు ఎందుకు జన్మించెనో గ్రహించుచున్నాను. హమ్ది, యిది నాకు స్పష్టముగా చెప్పుటకు నీవు ఎంతో బాధ్యత తీసి కొన్నందున వందనస్థుడనని అహ్మద్ కృతజ్ఞతతో పలికెను.

అహ్మద్ - మెషయా యందు విశ్వసించుట ద్వారా, దేవుడు మన పాపములన్నిటిని మన్నించి నిత్య జీవమునిచ్చుచున్నాడని, హమ్ది బహు గంభీర స్వరముతో చెప్పెను. మెషయాయే మరణము జయించి, మృతులను సహా లేవనెత్తును.

"అందుకు యేసు - పునరుత్థానమును జీవమును నేనే, నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును; బ్రతికి నాయందు విశ్వాస ముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" (యోహాను 11:25-26). హమ్ది చెప్పను.

అహ్మద్ ! మెషయా యందు విశ్వాసముంచుట ద్వారా దేవుని వరమును పొంద గోరుదువా? అవును. ఆయన నా హృదయమనె తలుపు యొద్ద యిప్పుడే తట్టుచున్నాడు అని కన్నీటితో చెప్పెను. అయితే నే నెట్లు దైవ వరమును పొందగలను?

అది కష్టముకాదు. నీ స్వంత మాటలతో దేవుని ప్రార్థించుము. సమస్త పాపము నొప్పుకొనుము. దేవునికి మరుగైన దేదియులేదు. మెషయా చేసిన యజ్ఞముద్వారా కలిగిన క్షమాపణనొందుము. మెషయా శిష్యునిగా వెంబడించునట్లు ఆత్మ సహాయము కోరి దేవుని ప్రార్థించుము. అది మెషయా నామమున ప్రార్థించుము. ఆయన బల్యర్పణ ద్వారా నీకును దేవునికిని మధ్యవర్తి ఆయెను. విశ్వాస మార్గములో మెషయాను దేవుని వరముగా చేర్చుకొనుట ద్వారా, గొప్ప అద్భుతము నీయందు జరుగును. బైబిలు చెప్పినట్లు - నీవు నూతన జన్మ నొందుదువు.

దేవుని నుండి నూతన జీవము నొందుదువు. మెషయా ద్వారా దేవునితో నూతన బాంధవ్యములో ప్రవేశింతువు. మెషయా నెందరు అంగీకరింతురో వారికి దేవుడు తండ్రియై వారు ఆయన పిల్లలగు అధికారము నొందుదురు.

"తన్ను ఎందరంగీకరించెదరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అను గ్రహించెను" (యోహాను 1:12).

వారు కలిసి ప్రార్థించిరి. దేవుని గొప్పస్వరముతో ఆనందముగా స్తుతించిరి. అహ్మద్: దేవుని కుటుంబములోనికి మెషయా ద్వారా యిదే నీకు ఆహ్వానము. అహ్మద్ సంపూర్ణ సంతోషముతో, నీ కెట్లు కృతజ్ఞతలు చెప్పగలను. దేవుని స్తుతించుము. నిత్యము అట్లే చేయుము. హమ్ది ప్రోత్సహించెను. నీ వలె మెషయాను అనుసరించువారి సహవాసమును కోరుకొనుము. ఇప్పుడు మెషయా తన శిష్యులకు నేర్పిన ప్రార్థన నీవు చేయగలవు-

"పరలోక మందున్న మాతండ్రీ!

నీ నామము పరిశుద్ధ పరచబడును గాక ; నీ రాజ్యము వచ్చును గాక, నీ చిత్తము పరలోక మందు నెరవేరుచున్నట్లు భూమి యందును నెరవేరును గాక. మా అనుదినాహారము నేడు మాకు దయ చేయుము. మా రుణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుము. మమ్ము ను శోధనలోకి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుము.

రాజ్యము, మహిమ, ప్రభావము నీకె చెందును. ఆమెన్. (మత్తయి 6:9-13)